## సిపిఆర్‌పై అవగాహన



ప్రజాపక్షం/ ఖమ్మం వైద్య విభాగం : ఖమ్మంలోని మమత మెడికల్ కాలేజ్ అండ్ జనరల్ హాస్పిటల్ ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగం ఆధ్వర్యంలో లకారం ట్యాంక్ బండ్ వద్ద ఆదివారం సిపిఆర్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సాధారణ ప్రజలు, సైక్లిస్టులు, జాగర్స్, వాకర్లకు అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలను కాపాడే సిపిఆర్‌పై అవగాహన కల్పించారు. ఎమర్జెన్సీ మెడిసిన్ వైద్య బృందం ప్రత్యక్ష ప్రదర్శన ద్వారా కంప్రెషన్ ఓన్లీ సిపిఆర్ విధానాన్ని వివరించి అత్యవసర సమయాల్లో తీసుకోవాల్సిన చర్యలను తెలిపారు. మమత మెడికల్ కాలేజ్ డైరెక్టర్ పువ్వాడ నరేన్, ప్రిన్సిపాల్ డాక్టర్ అనురాధ, మెడికల్ సూపరింటెండెంట్ డా.బి.రామస్వామి, ఆర్ఎంఓ డా కె.సంతోష్‌రెడ్డి ప్రోత్సాహం అందించారు. సుమారు 150మందికిపైగా పాల్గొని సిపిఆర్‌శిక్షణ పొందారు. ఈ కార్యక్రమంలో ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ కె.మహేంద్రకుమార్, సీనియర్ రెసిడెంట్ డా. తమ్మినేని శృతి, అధ్యాపకులు, రెసిడెంటుల వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

## డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ఉపాధ్యాయుడు వినూత్న ప్రచారం



ప్రజాపక్షం/వైరా: డ్రగ్స్, ట్రాఫిక్ అవగాహనలో భాగంగా సూర్యాపేట జిల్లాకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు సామాజిక కార్యకర్త అయిన రాచకొండ ప్రభాకర్ వినూత్న రీతిలో ప్రచారం నిర్వహిస్తున్నారు. సెలవుల్లో సామాజిక కార్యకర్తగా బాధ్యతాయుతమైన ఉపాధ్యాయుడిగా ప్రభాకర్ డ్రగ్స్, రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించేందుకు జన సమర్థ ప్రాంతాల్లో తెలంగాణలోని వివిధ పట్టణాల్లో పర్యటిస్తూ వైరా బస్టాండ్ చేరుకొని బస్టాండ్‌లో ఉన్నటువంటి ప్రయాణికులకు వినూత్న వేషధారణలో డ్రగ్స్, రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైరా పట్టణ ఎస్ఐ పుప్పాల రామారావు, ఆర్‌టిసి సిబ్బంది, ప్రయాణికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండుటెండలను లెక్కచేయక సామాజిక బాధ్యతగా ప్రచారం నిర్వహిస్తున్న ప్రభాకర్‌ను పలువురు అభినందించారు.

## కూసుమంచి మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా బజ్జూరి వెంకట్‌రెడ్డి



ప్రజాపక్షం/కూసుమంచి: కూసుమంచి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా బజ్జూరి వెంకట్‌రెడ్డిను నియమిస్తూ పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఉత్తర్వులు జారీ చేసినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఈసందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా ఎన్నికైన వెంకట్‌రెడ్డికి మండలంలోని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలిపారు. మాజీ ఎంపీపీ జూకూరు గోపాలరావు, చాట్ల పరశురాములుతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా బజ్జూరి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని, మం డలంలో కాంగ్రెస్ పార్టీని గ్రామ స్థాయి నుండి మరింత బలోపేతం చేసే దిశగా నాయకులు, కార్యకర్తలతో సమన్వయంగా పని చేస్తానని తెలిపారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు.

## తిరుపతమ్మ కుటుంబానికి పరామర్శ



ప్రజాపక్షం/ తల్లాడ : ఉపాధిహామీ పనిచేస్తూ అనారోగ్యంతో మృతి చెందిన తడకమళ్ల తిరుపతమ్మ కుటుంబానికి తల్లాడ మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ పెరిక నాగేశ్వరరావు, ఉపసర్పంచ్ కర్నాటి లక్ష్మారెడ్డి ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వపరంగా తిరుపతమ్మ కుటుంబాన్ని ఆదుకునే విధంగా తమవంతు సహాయ సహకారాలు అందిస్తామని పేర్కొన్నారు. వడదెబ్బ కారణంగా మృతి చెందిన ఆ కుటుంబాన్ని ప్రభుత్వం కూడా ఆదుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వారి వెంట పలువురు సిబ్బంది ఉన్నారు.

## ఏదులాపురం మున్సిపాలిటీలో నేడు జనగణన ప్రారంభం

ప్రజలు అందుబాటులో ఉండాలని కమిషనర్ విజ్ఞప్తి



ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ : ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో జనగణన కార్యక్రమం నేటి ఉదయం 7గంటల నుంచి ప్రారంభం కానుంది. ఈ మేరకు మున్సిపాలిటీ కమిషనర్ ఆళ్ల శ్రీనివాస్‌రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో విలేకరులకు వివరాలను వెల్లడించారు. జనగణన నిర్వహణ కోసం మున్సిపాలిటీ మొత్తాన్ని 155 హెచ్ఎల్‌బి బ్లాకులుగా విభజించినట్లు తెలిపారు. సర్వే నిర్వహణ కోసం 97మంది ప్రభుత్వ ఎన్యుమరేటర్లను నియమించగా, పర్యవేక్షణ కోసం 18మంది ప్రభుత్వ సిబ్బందిని సూపర్‌వైజర్లుగా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అదనంగా అత్యవసర అవసరాల కోసం 13మంది రిజర్వ్ సిబ్బందిని సిద్ధంగా ఉంచినట్లు చెప్పారు. ఇందులో ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు విధుల్లో పాల్గొననున్నారని పేర్కొన్నారు. ఈ జనగణనలో ఇంటింటి సర్వే నిర్వహించి, ప్రతి ఇంటికి ప్రత్యేక జనగణన నంబర్ కేటాయించనున్నట్లు వివరించారు. కావున మున్సిపాలిటీ ప్రజలు తమ ఇళ్ల వద్ద అందుబాటులో ఉండి సర్వే సిబ్బందికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## గాలివాన బీభత్సం..
# నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు

కూలిన ఏండ్ల నాటి వృక్షం

విద్యుత్ సరఫరాకు అంతరాయం





ప్రజాపక్షం/పాల్వంచ : మండలవ్యాప్తంగా శనివారం రాత్రి ఉరుములు మెరుపులతో కూడిన గాలివాన బీభత్సం సృష్టించింది. జగన్నాథపురం, నాగారం, తోగ్గూడెం, సూరారం, పాండురంగాపురం గ్రామాలలో 20 స్తంభాలు నేలకొరిగాయి. నాగారంలోని సబ్‌స్టేషన్ పరిధిలో ఓ స్తంభం కెవి ట్రాన్స్‌ఫార్మర్‌పై పడటంతో ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసమైనది. దీనితో విద్యుత్‌శాఖకు సుమారు లక్షా యాభై వేల ఆస్తినష్టం జరిగినట్లు తెలుస్తోంది. అధికారులు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు నిర్వహించి యథావిధిగా విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. మండల పరిధి పెద్దమ్మతల్లి దేవాలయంలో నిత్యం పూజలందుకొంటున్న ఏండ్లనాటి అశ్వద్ధామ వృక్షం కుప్పకూలి ఆలయ ముందు రేకులపై పడింది. ఎవరూ లేకపోవటంతో పెను ప్రమాదం తప్పింది. భద్రాచలం రహదారిపై పడటంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. అకాల వర్షానికి కల్లాల్లో ఆరబోసిన ధాన్యం తడిసిపోయిందని రైతాంగం ఆందోళనకు గురైంది. భారీ స్థాయిలో వర్షం కురవకపోవటంతో ఊపిరి పీల్చుకున్నారు. రైతులు తమ పంటలపై టార్పాలిన్‌లు కప్పి ఉంచటంతో రైతాంగానికి పెద్ద నష్టం జరగలేదు. పాల్వంచ, ములకలపల్లి మండలాలవ్యాప్తంగా గాడాంధకారం నెలకొన్నది. ఒక్కసారిగా పిడుగులా వచ్చిన గాలులతో కూడిన అకాల వర్షానికి విద్యుత్‌శాఖకు నష్టం వాటిల్లింది. పాల్వంచ సబ్ డివిజన్ పరిధి పాల్వంచ, ములకలపల్లి మండలాలలో వృక్షాలు నేలకొరిగాయి. పాల్వంచ మండలం నాగారం, జగన్నాథపురం, తోగ్గూడెం, పాండురంగాపురం, సూరారం గ్రామాలతో పాటుగా పట్టణ పరిధి కాంట్రాక్టర్స్ కాలనీ, హమాలీ కాలనీ, రాంనగర్, పేట చెరువు, శేఖరం బంజెర, ప్రాంతాలలో సుమారు 20 నుండి 30 స్తంభాలు నేలకొరిగాయి. ములకలపల్లి మండల, సీతారాంపురం, పూసుగూడెం, సీతాయగూడెం తదితర గ్రామాలలో 15 విద్యుత్ స్తంభాలు విరిగి పడ్డాయి. ఆయా గ్రామాలలో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం కలిగింది. దీనితో విద్యుత్ శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. యుద్ధ ప్రాతిపదికన ఆదివారం సాయంత్రం వరకు శ్రమించి మరమ్మతులు చేసి.. విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. విద్యుత్ ఎఇలు, సిబ్బంది సేవలు ప్రశంసనీయమని ఎడిఇ రహీముల్ హుస్సేన్ తెలిపారు.

## మధిరలో పర్యటించిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



ప్రజాపక్షం/ మధిర : రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మధిరలో ఆదివారం సుడిగాలి పర్యటన చేశారు. పర్యటనలో భాగంగా మందుగా జిలుగుమాడులోని పివిఆర్ ఫంక్షన్ హాల్ నందు జరిగిన వివాహ వేడుకకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం మధిరలోని సిద్దినేనిగూడెం సొసైటీ చైర్మన్ కటికల సీతారామిరెడ్డి సతీమణి గాయపడగా వారిని పరామర్శించారు. అనంతరం శ్రీరస్తు ఫంక్షన్ హాల్‌లో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు వేమిరెడ్డి సుధీర్‌రెడ్డి సోదరుడు కుమారుడి వివాహ వేడుకకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకుడు డాక్టర్ కోట రాంబాబు, డిసిసిబి డైరెక్టర్ ఐలూరి వెంకటేశ్వర్‌రెడ్డి, దేవిశెట్టి రంగారావు, టిఎస్ మెంబర్స్, ఉమ్మినేని కృష్ణ, అమరవాది సత్యనారాయణరెడ్డి, దేవరపల్లి అనంతరెడ్డి, శీలం వెంకట్రామిరెడ్డి, కపిలవాయి సత్యనారాయణరాజు, గోళ్ల ఉద్దండు, శీలం శ్రీనివాసరెడ్డి, అక్కినపల్లి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## ఈదురుగాలులకు దెబ్బతిన్న విద్యుత్ వ్యవస్థ

యుద్ధప్రాతిపదికన పునరుద్ధరణ పనులు

ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విద్యుత్ శాఖ సూచన



ప్రజాపక్షం/బూర్గంపాడు: శనివారం సంభవించిన భారీ ఈదురుగాలులు, వర్షాల ప్రభావంతో పినపాక పట్టినగర్, ఎంపీ బంజర గ్రామం, బతులనగర్ ప్రాంతాల్లో సుమారు 40 విద్యుత్ స్తంభాలు దెబ్బతిన్నాయని భద్రాచలం డివిజనల్ ఇంజనీర్ కె. జీవన్ కుమార్ తెలిపారు. భారీ గాలులకు చెట్లు విద్యుత్ లైన్లపై పడిపోవడంతో విద్యుత్ తీగలు తెగిపోయాయని, మూడు విద్యుత్ నియంత్రికలు నేలకూలిపోయాయని వెల్లడించారు. అసిస్టెంట్ డివిజన్ ఇంజనీర్ ఆపరేషన్ భద్రాచలం, బూర్గంపాడు ఎఇ ఉపేందర్, ఫీల్డ్ సిబ్బందితో పాటు మూడు కాంట్రాక్టర్ బృందాలు, మూడు యంత్రాలు, మూడు మండలాల విభాగాల సిబ్బంది యుద్ధ ప్రాతిపదికన నిరంతరం పునరుద్ధరణ పనులు చేపడుతున్నారని తెలిపారు. దెబ్బతిన్న స్తంభాల తొలగింపు, కొత్త స్తంభాల ఏర్పాటు, తెగిపోయిన, వంగిపోయిన విద్యుత్ తీగల మరమ్మతులు, నేలకూలిన విద్యుత్ నియంత్రికల పునరుద్ధరణ వంటి పనులు వేగంగా కొనసాగుతున్నాయని చెప్పారు. వినియోగదారులకు వీలైనంత త్వరగా విద్యుత్ సరఫరా పునరుద్ధరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. ప్రజలు దెబ్బతిన్న విద్యుత్ తీగలు, స్తంభాల సమీపానికి వెళ్లకుండా జాగ్రత్తగా ఉండాలని, విద్యుత్ శాఖ సిబ్బందికి సహకరించాలని విద్యుత్ శాఖ ఎఇ ఉపేందర్ విజ్ఞప్తి చేశారు.

## యాంత్రీకరణపై రైతులకు అవగాహన



ప్రజాపక్షం/ తల్లాడః ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ యాంత్రీకరణపై అవగాహన కార్యక్రమాన్ని తల్లాడ మండల పిఎసిఎస్ గంగాదేవిపాడు గ్రామంలో ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ విజయ్‌కుమార్ పాల్గొని మాట్లాడుతూ రైతు సోదరులు రసాయన ఎరువులు తగ్గించి సేంద్రీయ పద్ధతిలో వ్యవసాయం చేయాలని సూచించారు. వ్యవసాయాధికారులు చెప్పినట్లుగా తగిన పద్ధతులు పాటించాలని, రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందని, రైతును రాజు చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ప్రభుత్వం రైతులకు అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. ఎమ్మెల్యే చేతుల మీదుగా కల్టివేటర్లు, డ్రోన్లను రైతులకు అందించారు. అనంతరం నూతనకల్లు గ్రామంలో నున్న నరేష్ గృహ ప్రవేశానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరై ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్‌శాఖ అధికారులు, వ్యవసాయశాఖ అధికారులు, ప్రజా ప్రతినిధులు, సొసైటీ డైరెక్టర్లు, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఎఇని సస్పెండ్ చేయాలి



ప్రజాపక్షం/ములకలపల్లి: మండలంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల పరిస్థితి దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించని చందంగా మారిందని సిపిఐ (ఎంఎల్) మాస్‌లైన్ నాయకురాలు, రాచన్నగూడెం గ్రామ పంచాయితీ సర్పంచ్ మడకం విజయ ఆరోపించారు. ఆదివారం రాచన్నగూడెంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ సొంతింటి కల నెరవేర్చుకోవడం కోసం లబ్ధిదారులు అప్పులు చేసి ఇండ్లు నిర్మించుకుంటున్నారని తెలిపారు. చాలా ఇళ్లలో స్లాబ్ పనులు పూర్తయ్యాయని, మరికొన్ని స్లాబ్ దశలో ఉన్నాయని పేర్కొన్నారు. గత నెల రోజులుగా హౌసింగ్ ఎఇ మండలానికి అందుబాటులో లేకపోవడంతో పాటు, లబ్ధిదారులు ఫోన్ చేసినా స్పందించడం లేదని ఆరోపించారు. ఎఇ నిర్లక్ష్యం వల్ల బిల్లులు ఆలస్యమవుతూ లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఇంటికి రూ. 5వేల నుండి రూ.10వేల వరకు వసూలు చేస్తున్నారని, డబ్బులు ఇచ్చిన వారి ఫోటోలు వెంటనే తీస్తూ, లంచం ఇవ్వని లబ్ధిదారులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను వేగంగా పూర్తి చేయాలని మంత్రులు, ఎమ్మెల్యేలు.. అధికారులకు ఆదేశాలు ఇస్తున్నప్పటికీ, మండలంలో పరిస్థితి భిన్నంగా ఉందని అన్నారు. మండలంలోని సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పలుమార్లు సమస్యను వివరించినా స్పందన లేదని తెలిపారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఏఈపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై సోమవారం జిల్లా కలెక్టర్‌ను కలిసి మండలంలోని ఇందిరమ్మ ఇళ్ల సమస్యలను వివరించనున్నట్లు తెలిపారు.

## బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ చిమ్మపూడి గ్రామశాఖ కమిటీ ఎన్నిక

ప్రజాపక్షం/రఘునాథపాలెం: సిఐటియు అనుబంధ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ చిమ్మపూడి గ్రామ శాఖ నూతన కమిటీ ఎన్నిక జరిగినట్లు మండల అధ్యక్షుడు పోతం సీతారాములు తెలిపారు. స్థానిక చిమ్మపూడి గ్రామంలో నిర్వహించిన బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ మహాసభలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా పరిమిశెట్టి శ్రీనివాసరావు, కార్యదర్శిగా గొర్రె వెంకన్నబాబు, ఉపాధ్యక్షుడిగా దశరద గోపయ్య ఎన్నికయ్యారు. ఈ ఎన్నికల్లో 56 మంది తాపీ మేస్త్రీలు, 48 మంది కూలీలు పాల్గొన్నారు. ఈసందర్భంగా నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ భవిష్యత్తులో బిల్డింగ్ వర్కర్స్ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని తెలిపారు. కార్మికులకు ప్రభుత్వం నుండి అందాల్సిన లేబర్ కార్డు సేవలు, సంక్షేమ పథకాల అమలుపై రాజకీయాలకు అతీతంగా పోరాడుతామని పేర్కొన్నారు. ఎన్నికలకు సహకరించి తమకు ఎన్నుకున్న కార్మికులందరికీ నూతన కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## గ్రీన్ ఫీల్డ్ హైవే అధికారుల నిర్లక్ష్యం..

హైవేపై వ్యక్తి మృతి, ఇద్దరికి తీవ్ర గాయాలు

ప్రజాపక్షం/సత్తుపల్లి/వేంసూరుః గ్రీన్ ఫీల్డ్ హైవేపై అధికారుల నిర్లక్ష్యం, పెట్రోలింగ్ సిబ్బంది అసమర్థత కారణంగానే ఓ వ్యక్తి ప్రాణం కోల్పోవాల్సి వచ్చిందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే.. విజయనగరం జిల్లా బొబ్బిలికి చెందిన ముగ్గురు వ్యక్తులు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ కంపెనీలో చిరు ఉద్యోగులుగా పనిచేస్తున్నారు. వీరు ద్విచక్ర వాహనంపై హైదరాబాద్ నుంచి బొబ్బిలి బయలుదేరినట్లు సమాచారం. ఖమ్మం జిల్లా వైరా వరకు ప్రధాన రహదారిపై వచ్చిన వారు తెల్లవారుజామున గ్రీన్ ఫీల్డ్ హైవే ఎక్కినట్లు తెలుస్తోంది. అయితే గ్రీన్ ఫీల్డ్ హైవేపై ద్విచక్ర వాహనాలు, ఆటోలకు అనుమతి లేకపోయినా వారు హైవేపైకి ఎలా వెళ్లారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. వైరా వద్ద హైవే ప్రవేశ ప్రాంతంలో అధికారులు, సిబ్బంది పర్యవేక్షణ లేకపోవడమే ఇందుకు కారణమని వాహనదారులు ఆరోపిస్తున్నారు. పెట్రోలింగ్ సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించారా? నిద్ర మత్తులో ఉన్నారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వేంసూరు మండలం చోడవరం ఎర్రగుంటపాడు గ్రామాల మధ్య గ్రీన్ ఫీల్డ్ హైవేపై శనివారం తెల్లవారుజామున జరిగిన ప్రమాదంలో ద్విచక్ర వాహనం రైలింగ్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి.హైవేపై పెట్రోలింగ్ సరిగా లేకపోవడమే ప్రమాదాలకు ప్రధాన కారణమని స్థానికులు, వాహనదారులు అంటున్నారు. గ్రీన్ ఫీల్డ్ హైవేపై గేదెలు స్వేచ్ఛగా తిరుగుతున్న దృశ్యాలు అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శిస్తున్నారు. పెట్రోలింగ్ అధికారులు అప్రమత్తంగా వ్యవహరించి ఉంటే ఈ ప్రమాదం జరిగి ఉండేదా? ఒక నిండు ప్రాణం నిలిచి ఉండేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## గంగారం ధాన్యం కొనుగోలు కేంద్రంలో మొక్కుబడి కొనుగోళ్లు

క్వింటాకు 10 కిలోల తరుగు డిమాండ్ దుర్మార్గం

సిపిఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యుడు శ్రీనివాస్



ప్రజాపక్షం/సత్తుపల్లిః గంగారంలోని పిఎసిఎస్ ఆధ్వర్యంలోని ధాన్యం కొనుగోలు కేంద్రంలో కొనుగోళ్లు మొక్కుబడిగా సాగుతున్నాయని సిపిఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యుడు జాజిరి శ్రీనివాస్ ఆరోపించారు. ప్రారంభమై 45 రోజులు గడిచినా కేవలం 6 లారీల ధాన్యమే తరలించారని, దీంతో కౌలు, చిన్న రైతులు నానా అవస్థలు పడుతున్నారని తెలిపారు. శనివారం రాత్రి ఈదురుగాలుల వర్షానికి ధాన్యం తడవకుండా రైతులు పట్టాలకు రూ.50 చొప్పున రూ.500 వరకు వెచ్చించాల్సి వచ్చిందన్నారు. పెద్ద రైతులు మిల్లర్లతో నేరుగా క్వింటాకు 5 కిలోల తరుగుతో ఒప్పందం కుదుర్చుకుంటుండగా, చిన్న రైతుల నుంచి మాత్రం 10 కిలోలు డిమాండ్ చేస్తున్నారని విమర్శించారు. ఆదివారం కేంద్రాన్ని సందర్శించిన సిపిఐ(ఎం) బృందం రైతుల సమస్యలు తెలుసుకుని డిప్యూటీ తహసీల్దార్ నరేశ్‌కు వివరించింది. స్పందించిన డీటీ సోమవారం నుంచి సక్రమంగా కొనుగోళ్లు జరిపిస్తామని, తరుగు లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ(ఎం) నాయకులు బాల బుచ్చయ్య, కువ్వారపు లక్ష్మణరావు, రైతులు దేవళ్ల వెంకటేశ్వరరావు, ఉప్పతల ఏసుబాబు, మానికల మల్లేశ్వరరావు, యామాల నాగేశ్వరరావు, తమ్మిశెట్టి మారేశ్వరరావు, కొమెర రామారావు, కీసర బాబూరావు, మదార్ పాల్గొన్నారు.

## మాతృ దినోత్సవ వేడుకలు

ప్రజాపక్షం/చండ్రుగొండ: పేదలకు, గర్భిణీలకు సహాయ సహకారాలు అందించడమే వాసవిక్లబ్ అంతిమ లక్ష్యమని వాసవి క్లబ్ మండల కమిటీ బాధ్యులు స్పష్టం చేశారు. ఆదివారం మాతృదినోత్సవం సందర్భంగా వాసవి క్లబ్ మండల కమిటీ ఆధ్వర్యంలో చండ్రుగొండలోని కెసిఆర్ కాలనీలోని గర్భిణీలు, వృద్ధులకు పాలు, పండ్లు, పౌష్టికాహారం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం బాధ్యులు మాట్లాడుతూ వాసవి క్లబ్ అన్ని వర్గాల ప్రజల మన్నలు పొందేలా బలోపేంత చేస్తామన్నారు. ఈకార్యక్రమంలో వాసవి క్లబ్ అధ్యక్షుడు నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి సునీల్, ట్రెజరర్ ప్రసాద్, పవన్ కుమార్, భద్రరావు తదితరులు పాల్గొన్నారు.

## నిధుల పక్కదారిపై మంత్రి పొంగులేటికి ఫిర్యాదు




ప్రజాపక్షం/తిరుమలాయ-పాలెం : పిండిప్రోలు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తరగతి గదుల మరమతులు కళాశాల ఫర్నిచర్ కు అమ్మ ఆదర్శ పాఠశాల నిధుల ద్వారా ప్రభుత్వం సుమారు 28 లక్షల రూపాయలు నిధులు మంజూరు కాగా కళాశాల తరగతి గదులు మరమ్మతులు చేపట్టగా కళాశాలలో మౌలిక వసతులు కోసం విద్యార్థి విద్యార్థినిల టాయిలెట్స్ మరమ్మతులు చేపట్టారు. కళాశాలలో జరుగుతున్న పనులను క్షేత్రస్థాయిలో జిల్లా అదనపు కలెక్టర్ శ్రీజ పనులను పరిశీలించి వచ్చే నూతన విద్యా సంవత్సరానికి కళాశాలకు వచ్చే విద్యార్థులకు అన్ని వసతులను కల్పించాలని ఆమె తెలిపారు. అమ్మ ఆదర్శ పాఠశాల అభివృద్ధి కమిటీ లో చైర్మన్ ప్రిన్సిపల్ అధ్యాపకులతో కమిటీని ఏర్పాటు చేయగా ఇట్టి కమిటీ జాయింట్ అకౌంట్లో ప్రభుత్వ నగదు జమ చేసింది ఈ నగదును చేసిన పనులను బట్టి ఏఈ ఎంబీలు సమర్పించిన అనంతరం కాంట్రాక్టర్ కు నగదును అందించడం జరుగుతుంది అని ఆమె తెలిపారు. గతంలో విధులు నిర్వహించిన మాజీ ప్రిన్సిపల్ ఉపేంద్ర జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కళాశాల ఫర్నిచర్ ను కొనుగోలు చేశామని కళాశాల మనుమంతుల పనులు త్వరగా పూర్తిచేసి ఎంబిలు అందించిన వెంటనే మిగతా నగదును సంబంధిత కాంట్రాక్టర్ కు అందించి పనులు పూర్తి చేయాలని ఆమె తెలిపినట్లు వివరించారు. ఈ క్రమంలో చైర్మన్ కళాశాల రాయిండ్ల స్వాతి ఖాళీ చెక్కులపై సంతకాలు చేయించుకొని కళాశాల నగదు పక్కదారి పట్టించినట్లు మంత్రి పొంగులేటి కి ప్రజాదర్బార్ లో ఫిర్యాదు చేసింది. ఈ విషయంపై కళాశాల ప్రిన్సిపల్ ఉపేంద్ర ను వివరణ కోరగా జిల్లా అదనపు కలెక్టర్ శ్రీజ ఆదేశాల మేరకు కళాశాల ఫర్నిచర్ కొనుగోలు చేశామని నిధులు ఒక రూపాయి కూడా దుర్వినియోగం కాలేదని వివరించారు.

## ‘ప్రజాపక్షం’ కథనాలపై నిఘావర్గాల ఆరా..

రియల్ మాటున జరిగిన ఫోర్జరీలపై నివేదిక

చర్యల్లో జాప్యంపై ప్రజల్లో పెరుగుతున్న అసంతృప్తి

ప్రజాపక్షం ఎఫెక్ట్

ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ : ఖమ్మంరూరల్ మండలాన్ని కుదిపేసిన ఫోర్జరీ మాఫియాపై ‘ప్రజాపక్షం’ దినపత్రిక వరుస కథనాలు ప్రచురిస్తున్న విషయం తెలిసిందే. ముఖ్యంగా ‘ఒక్కరితో సరిపోతుందా?’, ‘ఉలిక్కిపడ్డ ఫోర్జరీ మాఫియా’ శీర్షికన వెలువడిన కథనాలు జిల్లా వ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. అలాగే సామాజిక మాధ్యమాల్లో సైతం ఈ వ్యవహారంపై పెద్ద ఎత్తున్న చర్చ సాగుతోంది. ఈ దందాలో పాల్గొన్న రియల్ వ్యాపారులు, కొందరు ప్రజాప్రతినిధులు ఎవరన్న దానిపై ప్రజల్లో ఆసక్తికర చర్చ నడుస్తున్నట్లు సమాచారం. ఇది కచ్చితంగా సదరు వ్యక్తుల పనే అంటూ గుసగుసలు వినిపిస్తున్నాయి. దీనిపై సాక్షాత్తు తోటి రియల్ వ్యాపారులు పేర్లతో సహా చర్చించుకుంటుండటం విశేషం. ఇదిలా ఉం డగా, ఈ అడ్డగోలు వ్యవహారంపై నిఘా వర్గాలు సైతం ఆరా తీసినట్లు సమాచారం. గతంలో వెలుగులోకి వచ్చిన రియల్ వ్యాపారులతో పా టు మాజీ ప్రజాప్రతనిధులు పాత్రపై కూడా దృ ష్టి సారించినట్లు తెలుస్తోంది. ప్రధానంగా ఈ అవినీతిలో ప్రమేయం ఉన్నట్లు ఆరోపణలు ఎ దుర్కొంటున్న మాజీ ప్రజాప్రతినిధుల పేర్లను జాబితాలో చేర్చినట్లు సమాచారం. ఈ వ్యవహారానికి సంబంధించిన వివరాలను క్రోడీకరించి ఓ సమగ్ర నివేదిక రూపొందించి ఉన్నతాధికారులకు పంపిచినట్లు విశ్వసనీయ సమాచారం. అ యితే ఇంత పెద్ద ఎత్తున్న ఆరోపణలు, ఆధారాలు వెలుగులోకి వస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు ముట్టీ ముట్టనట్టుగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఫోర్జరీ వ్య వహారంలో కొందరు వ్యాపారులు, ప్రజాప్రతనిధులు కోట్ల రూపాయలు సంపాదించుకున్నప్పటికీ, ప్లాట్లు కొనుగోలు చేసిన సాధారణ ప్రజలకు మాత్రం తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తమవుతోంది. బాధితులకు న్యాయం చేయడంతో పాటు దోషులపై కఠిన చ ర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నా రు. అవినీతిని అక్షరరూపం అందజేసి ప్రజాక్షేత్రంలో ఎండగట్టిన ‘ప్రజాపక్షం’ దినపత్రికకు ప లువురి నుంచి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.

# ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు సర్వం సిద్ధం

సిఎస్, డిఓల పాత్ర కీలకం
నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు
జిల్లా ఇంటర్ విద్యాధికారి రవికుమార్

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** 2025–26 విద్యా సంవత్సరం అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల ని ర్వహణలో చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులదే ప్రముఖ పాత్ర కీలకమ ని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే ఇం టర్ బోర్డు కఠిన చర్యలు తీసుకుంటుందని ఇం టర్ విద్యాధికారి రవికుమార్ స్పష్టం చేశారు. ఆదివారం జిల్లా బాలుర(ఖిల్లా) జూనియర్ కళాశాలలో ఉదయం చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులు, కస్టడియన్లు, అసిస్టెంట్ చీఫ్ సూపరింటెండెంట్ల సమావేశం నిర్వహించి మాట్లాడారు. జిల్లాలో 39 పరీక్షా కేం ద్రాలు ఏర్పాటు చేశామని, ఇంటర్ బోర్డు కమీషనర్, జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ఈనెల 13 నుండి 19 వరకు నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేశామన్నారు. చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట ల్ అధికారులు పరీక్షల నిర్వహణలో ఏ మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఇంటర్ బోర్డు కఠిన చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు. సి ఎస్, డిఓలు తమకు కేటాయించిన పరీక్ష కేం ద్రాల్లో వెంటనే సీసీ కెమెరాలు పని చేసేలా చూ డాలన్నారు. ప్రశ్నపత్రాల బండిళ్లను సీసీ కెమెరాల ముందే ఓపెన్ చేయాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రాల్లో మౌలిక వసతులు వెంటనే స మకూర్చాలని ఆదేశించారు. సెల్‌ఫోన్లను ఎట్టి ప రిస్థితిలో పరీక్ష కేంద్రంలో అనుమతించే ప్రసక్తే లేదని, సిఎస్, డిఓలు కూడా పరీక్ష జరుగుతు న్న సమయంలో సెల్‌ఫోన్లను పోలీస్ కస్టడీలోనే ఉంచాలన్నారు. పరీక్షల నిర్వహణకు ముందే ఇ న్విజిలేటర్ల సమావేశం నిర్వహించి తగిన ని యమ నిబంధనలు వివరించాలని సిఎస్, డిఓల ను ఆదేశించారు. ప్రతిరోజు ఫ్లయింగ్, సిట్టింగ్, ఇంటర్ బోర్డు స్క్వాడ్లతో పాటు జిల్లా పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులు అన్ని పరీక్షా కేంద్రాలను తనిఖీ చేస్తారన్నారు. సిఎస్, డిఓలు సప్లిమె ంటరీ పరీక్షలు ఉదయం మొదటి సంవత్సరం మధ్యాహ్నం రెండవ సంవత్సరం విద్యార్థులకు పరీక్షలు ఉంటాయని విస్తృతప్రచారం చేయాల ని ఆదేశించారు. విద్యార్థులను పరీక్షాహాల్‌లోకి పంపే ముందే క్షుణ్ణంగా తనిఖీ చేసి



పంపించే బాధ్యత సిఎస్, డిఓలదేనని స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో రెవెన్యూ విద్యాశాఖ విద్యుత్, ఆర్టీసీ, హెల్త్, పోస్టల్, పోలీసు అధికారులతో ఇదివరకే సమన్వయ సమావేశం జరిగిందని, పరీక్ష కేంద్రాల వారిగా సిఎస్, డిఓలు సంబంధిత స్థానిక అధికారులకు తగిన ఏర్పాట్ల కోసం లెటర్లు రాయాలని ఆదేశించారు. ప్రిన్సిపాల్ ఖాలిక్‌లు, సిఎస్, డిఓలకు పరీక్షల నిర్వహణ బాధ్యతలను వివరించారు.

## టిపిసిసి చీఫ్‌ను, మంత్రిని కలిసిన : పివిఆర్



**ప్రజాపక్షం/ఆర్మూర్ :** హైదరాబాద్‌లో ఆదివారం టిపిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ తెలంగాణ రణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి పొద్దుటూరి వినయ్‌కుమార్‌రెడ్డి ఎఎంసి చైర్మన్ సాయిబాబాగౌడ్, శ్రీనివాస్‌గౌడ్ మర్యాదపూర్వకంగా కలిసి నియోజకవర్గ సమస్యలపై వారితో చర్చించారు.

## మద్ది రామ్‌చందర్ ఆశయ సాధనకు కృషి



**ప్రజాపక్షం /కాసిపేట :** ఆదివాసి హక్కుల కోసం పోరాడిన మద్ది రామ్‌చందర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆదివాసి నాయకులు పిలుపునిచ్చారు. మంచిర్యాల జిల్లా కాసిపేట మండలం దేవాపూర్ ఏజెన్సీ పంచాయతీ పరిధిలోని నాయకపుగూడలో ఆదివారం ఆదివాసి నాయక పోడు సేవా సంఘం ఆధ్వర్యంలో సంఘ వ్యవస్థాపకులు అమరుడు మద్ది రామ్‌చందర్ 26వ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఆదివాసి సంప్రదాయ పద్ధతుల్లో పూజలు నిర్వహించి నివాళులర్పించారు. నాయకులు మాట్లాడుతూ ఆదివాసీల వెనుకబాటుతనానికి విద్యా లోపం,దోపిడీలే కారణమని గుర్తించిన రామ్‌చందర్ తన సొంత ఖర్చులతో విద్యార్థులకు వసతి కల్పించి విద్యాబుద్ధులు నేర్పించారని కొనియాడారు. మందమర్రి ఏజెన్సీ ప్రాంతంలో మున్సిపాలిటీ ఎన్నికలను రద్దు చేసి గ్రామపంచాయతీ వ్యవస్థను కొనసాగించాలని, 1/70 చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని ఆయన ఎన్నో ఉద్యమాలు చేశారని గుర్తుచేశారు. ఆదివాసి యువత ఆయన స్ఫూర్తితో హక్కుల సాధన కోసం ఐక్యంగా పోరాడాలని కోరారు. దేవాపూర్ సర్పంచ్ రాందాస్, ఆదివాసి నాయకపోడు సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొమ్ముల బాపు, రాష్ట్ర ఉపాధ్యక్షులు తట్ర భీమారావు, భీమిని మహేందర్, ఆదాని సిమెంటు కంపెనీ యూనియన్ ప్రధాన కార్యదర్శి మెరుగు శంకర్,వర్కింగ్ ప్రెసిడెంట్ సంద్ర బాపు,గ్రామ పెద్దమనిషి రోడ్డ రాజం,సామ రాజిరెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఆత్రం అమృతరావు, లక్ష్మి, భీమక్క,కొమ్ముల సంజీవ్ పాల్గొన్నారు.

## మెడికల్ అండ్ హెల్త్ చైర్మన్‌కు సన్మానం



**ప్రజాపక్షం/భీమ్‌గల్ రూరల్ :** నగరంలోని ప్రముఖ వర్ధన్ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ తెడు సృజిల్‌బాబు డాక్టర్ సెల్ మెడికల్ అండ్ హెల్త్ వింగ్‌కు జిల్లా డీసీసీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. డాక్టర్ సృజిల్ బాబు ముచ్కూర్ గ్రామస్తుడు కావటంతో గ్రామ మాదిగ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఫంక్షన్ హాల్‌లో చైర్మన్ సృజిల్‌కు పూలమాలలు వేసి శాలువతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. సంఘం సభ్యులు మాట్లాడుతూ డాక్టర్ సృజిల్ బాబు జిల్లా చైర్మన్ కావటం చాలా సంతోషమని, ముమ్ముందు మరిన్ని సేవలందించాలన్నారు.దువ్వల చంద్రమోహన్, అన్వేష్, సుదర్శన్, గంగాధర్, గంగసాయిలు, అశోక్ పాల్గొన్నారు.

## నిలిచిన మంచినీటి సరఫరా

స్పందించని యాజమాన్యం

**ప్రజాపక్షం /శ్రీరాంపూర్ :** శ్రీరాంపూర్ కాలనీ,ఆర్కే8,గాంధీ నగర్ కార్మిక వాడల్లో గత నాలుగు రోజులుగా మంచినీటి సరఫరా లేక కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న, సింగరేణి యాజమాన్యం పట్టించుకోవడంలేదని గుర్తింపు కార్మిక సంఘం (ఎస్సిడబ్ల్యూ) ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు కందికట్ల వీరభద్రయ్య , ముస్కే సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్కే బాజీ సైదా అన్నారు. మంచినీటి సరఫరా సమస్యకు గల కారణాలు ఆరా తీయగా ఎస్ఆర్పి1 గనిలో రెండు పంపులు మునిగాయని దీనివల్ల నీటి సరఫరాకు ఆంతర్యం ఏర్పడిందని యాజమాన్యం పేర్కొంటుందని తెలిపారు. అయినప్పటికీ ఒక గనిలో పంపులు మునిగితే మరొక గని నుండి మంచినీటి సరఫరా చేయాల్సిన బాధ్యతగల యాజమాన్యం గత నాలుగు రోజులుగా ఏమాత్రం పట్టింపు లేని విధంగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. ఇప్పటికైనా యాజమాన్యం వెంటనే స్పందించి కార్మిక కాలనీలలో నీటి సరఫరా చేయాలని అన్నారు.లేని పక్షం కార్మిక కుటుంబాలతో కలిసి జిఎం కార్యాలయాన్ని ముట్టడిస్తామని ఈ సందర్భంగా హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో బ్రాంచ్ ఉపాధ్యక్షులు కొట్టే కిషన్ రావు,సహాయ కార్యదర్శి మోత్కూరి కొమురయ్య పాల్గొన్నారు.

## తెలంగాణ జనసమితి రాష్ట్ర ప్లీనరీ విజయవంతం:మోహన్‌రెడ్డి పిలుపు

**ప్రజాపక్షం / నిర్మల్ టౌన్ :** నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఇందిరానగర్‌లో ఉన్న తెలంగాణ జనసమితి పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు కడపత్రి తిలక్‌రావు అధ్యక్షతన జిల్లా ప్లీనరీ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర రైతు విభాగం అధ్యక్షుడు, ఉమ్మడి జిల్లా ఇంచార్జి కంతి మోహన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ నెల 12వ తేదీన హైదరాబాద్‌లోని జల విహార్ వేదికగా జరగనున్న తెలంగాణ జన సమితి 4వ రాష్ట్ర ప్లీనరీని భారీ ఎత్తున విజయవంతం చేయాలని ఆయన పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. తెలంగాణ సాధనలో అమరులైన వరి ఆకాంక్షలను నెరవేర్చాలని, రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు అందాలనే ప్రధాన ఉద్దేశంతో 2018లో పార్టీని స్థాపించడం జరిగిందని మోహన్‌రెడ్డి గుర్తు చేశారు. గత రెండేళ్ళుగా నిర్మల్ జిల్లాలో రాష్ట్ర కమిటీ సూచించిన ప్రతి కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేస్తున్న నాయకులను, కార్యకర్తలను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ ప్లీనరీ సమావేశంలో ముథోల్ ఇంచార్జి సర్దార్ వినోద్‌కుమార్, విద్యార్థి విభాగ రాష్ట్ర కార్యదర్శి దిలీప్, జిల్లా కార్యదర్శి చిట్లమల్ల రెడ్డిలతో పాటు జిల్లా నాయకులు రాజకుమార్, వాజిద్ అహ్మద్‌ఖాన్, భాస్కర్, పలువురు మైనారిటీ నాయకులు పాల్గొన్నారు. రాబోయే రాష్ట్ర ప్లీనరీకి జిల్లా నుండి అధిక సంఖ్యలో కార్యకర్తలు తరలిరావాలని నాయకులు కోరారు.




## ధాన్యం కొనుగోలులో వేగం పెంచాలి

ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు

**ప్రజాపక్షం/పాపన్నపేట:** ధాన్యం కొనుగోలు ప్రక్రియలో వేగం పెంచాలని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు సూచించారు. ఆదివారం సాయంత్రం పాపన్నపేటలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు.కొనుగోలు కేంద్రంలో ఉన్న ధాన్యాన్ని పరిశీలించారు. కొనుగోలు ప్రక్రియలో రైస్ మిల్లర్లు ఇబ్బందులు పెడుతున్నారని స్థానిక నాయకులు, రైతులు ఆయన దృష్టికి తీసుకురావడంతో వెంటనే స్పందించి పలువురు రైస్ మిల్లర్లతో ఫోన్లో మాట్లాడారు. రైతులు అధైర్య పడవద్దని పండించిన ప్రతి చివరి గింజ వరకు ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేస్తుందని పేర్కొన్నారు. అధికారులు ఎప్పటికపుడు కొనుగోలు ప్రక్రియను పరిశీలించాలని సూచించారు.వార్డ్ మెంబర్ చోటు ఇంటికి వెళ్లి ఇటీవల వివాహమైన వారి సోదరుడు ఆసిఫ్ ను ఆశీర్వదించారు. ఎమ్మె ల్యే వెంట మెదక్ మున్సిపల్ వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్, మండల కాం గ్రెస్ పార్టీ అధ్యక్షుడు నరేందర్ గౌడ్, మండల నాయకులు ప్రశాంత్ రెడ్డి, శ్రీనివాస్, శ్రీకాంతప్ప, శ్రీనివాస్, హీరాలాల్, గౌస్, తదితరులున్నారు.



## పకడ్బందీగా బాసర మాస్టర్ ప్లాన్ అమలు

దేవాదాయ శాఖ
కమిషనర్ హనుమంతరావు

**ప్రజాపక్షం / నిర్మల్ :** బాసర శ్రీ జ్ఞాన సరస్వతీ ఆలయ మాస్టర్ ప్లాన్ అమలుపై అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. ఆదివారం రాష్ట్ర దేవాదాయ శాఖ కమీషనర్, హనుమంతరావు, జిల్లా కలెక్టర్ భవేశ్‌మిశ్రాలు బాసర శ్రీ జ్ఞాన సరస్వతీ అమ్మవారి ఆలయ మాస్టర్‌ప్లాన్ అమలు గురించి పర్యటించారు. మంపదుగా అధకారులు సరస్వతీ అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణం, మహాలక్ష్మీ అమ్మవారి ఆలయం, వ్యాస గుహ తదితర ప్రాంతాలు తిరిగి చూశారు. మాస్టర్ ప్లాన్ అమలు గురించి కీలక అంశాలు చర్చించారు. ఈ సందర్భంగా దేవాదాయ శాఖ కమీషనర్ హనుమంతరావు మాట్లాడుతూ, బాసర మాస్టర్ ప్లాన్ అమలుతో ఆలయ రూపురేఖలు మారనున్నాయని చెప్పారు. బాసర క్షేత్రం ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చెందుతుందన్నారు. 225 కోట్ల రూపాయల వ్యయంతో బాసర ఆలయాన్ని ప్రఖ్యాత ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దనున్నట్టు చెప్పారు. ఆగమ శాస్త్రాల నియమాల ప్రకారం, భక్తుల విశ్వాసాలకు అనుగుణంగా, అభివృద్ధి పనులు చేపడతామని తెలిపారు. అమ్మవారి దర్శనం కోసం దేశ నలుమూలల నుంచి వచ్చే భక్తులకు అన్ని వసతులు కల్పిస్తామని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా మాట్లాడుతూ, బాసర ఆలయ అభివృద్ధి కొరకు ఇటీవలి రాష్ట్ర ముఖ్యమంత్రి శంకుస్థాపనలు చేశారని చెప్పారు. మాస్టర్ ప్లాన్ అమలు ద్వారా ఆలయం అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. భక్తులకు సకల సౌకర్యాలతో ఆలయ నిర్మాణం జరుగుతుందని అన్నారు. అభివృద్ధి పనులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తామని చెప్పారు. రానున్న గోదావరి పుష్కరాలకు తగిన ఏర్పాట్లు చేస్తామని వివరించారు. భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, సాయికిరణ్, ఆలయ అంజనాదేవి, తహసిల్దార్ పవన్‌చంద్ర, ఇతర అధికారులు సిబ్బంది, పాల్గొన్నారు.



## పేకాటలో దొరికిన ఆదర్శ సర్పంచ్ కథనంపై చర్చ..!

**ప్రజాపక్షం/రామాయంపేట:** బాధ్యతాయుతమైన పదవిలో ఉండి గ్రామానికి ఆదర్శం గా నిలవాల్సిన స ర్పంచు పేకాట స్థావరంలో అడ్డంగా దొరికిపోవడం ఇప్పుడు రామాయంపేట మండల వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఈ ఉదంతంపై నీతులు చెప్పేందుకేనా పేకాటలో దొరికిన ఆదర్శ సర్పంచు అనే శీర్షికతో ప్రజాపక్షం పత్రికలో ప్రచురితమైన కథనం అధికార వర్గాల్లోను, సామాన్య ప్రజల్లోను తీవ్ర చర్చకు దారితీసింది. ప్రగతి ధర్మారం సర్పంచు బండారి శ్రీనివాస్‌గౌడ్ పేకాటలో దొరి కి కేసులో ఇరుక్కోవడంపై చుట్టుపక్కల గ్రామాల్లో కూడా ఇదే విషయం చర్చించుకుంటున్నారు. ప్రజాపక్షం కథ నం ముఖ్యంగా సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. పోలీసులు కేసు నమోదు చేసినప్పటికి పంచాయతి రాజ్ చట్టం ప్రకారం సదరు సర్పంచుపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచిచూడాలి.

## ధాన్యాన్ని దళారులకు విక్రయించొద్దు

అదనపు కలెక్టర్ నగేష్

**ప్రజాపక్షం/రామాయంపేట:** ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని అధికారులను అదనపు కలెక్టర్ నగేష్ ఆదేశించారు. ఆదివారం మండలంలోని దామరచెర్వు గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని అదనపు కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం మండల కేంద్రంలోని శ్రీనివాస రైస్‌మిల్‌కు చేరుకున్న అదనపు కలెక్టర్ గోదాంలో నిల్వలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. దాన్యాన్ని దళారులకు విక్రయించకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలని ఆయన సూచించారు. అన్‌లోడ్ అయిన లారీలను త్వరితగతిన కేంద్రాలకు తరలించాలన్నారు. ఆయన వెంట డిప్యూటి తహశీల్దార్ నవీన్, ఆర్ఐ గౌస్‌తో పాటు జిపివో ప్రవీన్ తదితరులు ఉన్నారు.



## డాక్టర్ వెంకట్‌కు రాష్ట్ర స్థాయి బిసి కవితా భేరి పురస్కారం



**ప్రజాపక్షం / నిర్మల్ టౌన్ :** నిర్మల్ జిల్లాకు చెందిన ప్రముఖ సంస్కృతాంధ్ర పద్యకవి, తెలంగాణ రచయితల వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ వెంకట్‌కు రాష్ట్ర స్థాయి గౌరవం లభించింది. హైదరాబాద్‌లోని చిక్కడపల్లి లో గల శ్రీ త్యాగరాయ గాన సభ ప్రధాన మందిరంలో, తెలంగాణ సాహిత్య అకాడమీ, తెలుగు భాషా చైతన్య సమితి సంయుక్త ఆధ్వర్యంలో మహాత్మాజ్యోతిరావు పూలే ద్విశతాబ్ది జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. డాక్టర్ వెంకట్ ముఖ్య అతిథిగా పాల్గొనడమే కాకుండా, రాష్ట్ర స్థాయి బీసి కవితా భేరి సన్మానాన్ని మరియు అభినందన పత్రాన్ని అందుకున్నారు. రాష్ట్రం నలుమూలల నుండి సుమారు 150 మందికి పైగా కవులు, కవయిత్రులు పాల్గొన్న ఈ భారీ సాహిత్య సమ్మేళనంలో పూర్వ తెలంగాణ అసెం బ్లీ స్పీకర్ మధుసుధనాచారి, బీసి సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్. కృష్ణయ్య తదితర ప్రముఖులు హాజరయ్యారు. సంస్కృత భాషా ప్రచార సమితి ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల వ్యవస్థాపక అధ్యక్షులుగా సేవలందిస్తున్న డాక్టర్ వెంకట్‌కు ఈ అరుదైన గౌరవం దక్కడం పట్ల జిల్లా సాహిత్య వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

## ఘనంగా పి.వి. రావు 74వ జయంతి



**ప్రజాపక్షం/మావల:** మాల మహానాడు వ్యవస్థాపక అధ్యక్షుడు పివి రావు 74వ జయంతి వేడుకలను ఆదివారం న్యూ హౌసింగ్ బోర్డు కాలనీలోని మాల సంక్షేమ సంఘ భవనంలో ఘనంగా నిర్వహించారు. మాల సంక్షేమ సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు అల్లూరి భూమన్న ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాలలను చైతన్యవంతం చేయడంలో పివి రావు కృషి మరువలేనిదని పేర్కొన్నారు. దేశ అత్యున్నత న్యాయస్థానంలో వర్గీకరణ జీవోను రద్దు చేయించడంలో ఆయన కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు.

## ఇటుక దందా.. ఇష్టా రాజ్యంగా ఇటుక బట్టీలకు అనుమతులు!

**ప్రజాపక్షం /సిర్పూర్-టి :** సిర్పూర్‌టి మండలంలోని వేంపల్లి నుండి సిర్పూర్, లోనవెల్లి,గ్రామం వరకు నడుస్తున్న ఇటుక బట్టీలకు సరైన అనుమతులున్నాయా అన్న ప్రశ్నలు ప్రజల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. పెద్ద ఎత్తున బట్టీలు నిర్వహించబడుతున్నప్పటికీ, సంబంధిత శాఖల నుంచి ఎలాంటి అనుమతులు తీసుకున్నారనే అంశంపై స్పష్టత లేకపోవడం ఆందోళనకు గురిచేస్తోంది. నియమాల ప్రకారం ఇటుక బట్టీలు ఏర్పాటు చేయాలంటే పలు శాఖల అనుమతులు తప్పనిసరి. కాలుష్య నియంత్రణ బోర్డు, రెవెన్యూ శాఖ, గ్రామ పంచాయతీ అనుమతులతో పాటు విద్యుత్ కనెక్షన్ కోసం కూడా చట్టబద్ధమైన ప్రక్రియ ఉండాలి. అయితే ప్రస్తుతం నడుస్తున్న బట్టీలకు ఈ అనుమతులు ఉన్నాయా లేదా అన్నది తెలియకపోవడం సందేహాలకు తావిస్తోంది.ఇక బట్టీల్లో పనిచేస్తున్న వలస కార్మికుల పరిస్థితి కూడా దారుణంగా ఉందని సమాచారం. కనీస వసతులు లేకుండా, భద్రతా ప్రమాణాలు పాటించకుండా పనులు చేయించడం జరుగుతోందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. బాల కార్మికులు కూడా పనిచేస్తున్నారని స్థానికులు చెబుతున్నారు.అక్రమంగా నడుస్తున్న బట్టీలకు విద్యుత్ కనెక్షన్లు ఎలా మంజూరు అయ్యాయన్నది మరో కీలక ప్రశ్నగా మారింది. సంబంధిత అధికారులు తనిఖీలు నిర్వహించకపోవడం పట్ల ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.ప్రభుత్వం అమలు చేస్తున్న ఇళ్ల నిర్మాణ పనులతో ఇటుకల డిమాండ్ పెరగడం ఈ వ్యాపారానికి ఊతమిచ్చినప్పటికీ, చట్టాలను ఉల్లంఘిస్తూ బట్టీలు నడపడం సమంజసం కాదని ప్రజలు అంటున్నారు.అధికారులు వెంటనే స్పందించి బట్టీలకు ఉన్న అనుమతులపై స్పష్టత ఇవ్వాలని, అక్రమంగా నడుస్తున్న వాటిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



## పశువుల రవాణా పేరుతో అక్రమ వ్యాపారం

చెక్ పోస్ట్‌లో మెడికల్ రిపోర్ట్ ఉంటే ఓకే
80 వాహనాలకు అనుమతులు..?

**ప్రజాపక్షం /సిర్పూర్ టీ :** సిర్పూర్ టీ, కౌటాల మండలాల పరిధిలో పశువుల అక్రమ రవాణా జోరుగా సాగుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల సరిహద్దుల నుంచి పశువులను అక్రమంగా కొనుగోలు చేసి కౌటాల మార్కెట్ మీదుగా సిర్పూర్ టీ, కాగజ్‌నగర్ ప్రాంతాలకు తరలిస్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. అక్కడి నుంచి ఐచర్ వ్యాన్లు, కంటైనర్ వాహనాల్లో హైదరాబాద్ వైపు రవాణా చేస్తున్నట్లు సమాచారం. శనివారం రోజున పశువుల రవాణాకు సంబంధించి భారీ స్థాయిలో అనుమతులు జారీ చేసినట్టు తెలిసింది.ఈ విషయంపై స్పందించిన పశువుల వైద్యులు. మాట్లాడుతూ, ఒక బొలెరో వాహనంలో రెండు పశువులకు, ఐచర్ వ్యాన్‌లో ఆరు పశువులకు అనుమతి ఇచ్చామని తెలిపారు. మొత్తం సుమారు 80 వాహనాలకు అనుమతులు జారీ చేసినట్టు వెల్లడించారు.అయితే, లెక్కల ప్రకారం చూస్తే బొలెరో వాహనాలకు మాత్రమే సుమారు 160 పశువులు తరలించినట్టు అనుమతుల ప్రకారం సూచిస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. కానీ ఆ పశువులన్నీ కౌటాల మార్కెట్‌కు చెందినవేనా..? లేదా ఇతర రాష్ట్రాల నుంచి అక్రమంగా తెచ్చినవేనా..? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.శనివారం రోజున కౌటాల వారసంత కాదు మరి మార్కెట్‌లో అంత పెద్ద స్థాయిలో పశువుల కొనుగోలు విక్రయాలు జరగలేదని పలువురు వ్యాపారులు చెబుతున్నారు. అయినప్పటికీ పెద్ద సంఖ్యలో రవాణా అనుమతులు ఎలా జారీ అయ్యాయనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.పశువుల రవాణా పేరుతో అక్రమ వ్యాపారం జరుగుతోందని, ఇందులో కొందరు మధ్యవర్తులు, వ్యాపారులు పాల్గొంటున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారం పై జిల్లా ఉన్నతాధికారులు, పోలీసు శాఖ, పశుసంవర్ధక శాఖ సంయుక్తంగా దర్యాప్తు చేపట్టి అ క్రమ రవాణాను అరికట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అలాగే అనుమతులు జారీ చేసిన విధానం,పశువుల అసలు మూలాలు,రవాణా గమ్యస్థానాలపై పూర్తి విచారణ జరపాలని కోరుతున్నారు.



## అక్రమంగా ఆవుల తరలింపు.. ఇద్దరి అరెస్ట్

**ప్రజాపక్షం/నేరడిగొండ:** జిల్లా ఎస్‌పి అఖిల్ మహాజన్ ఆదేశాల మేరకు పోలీసులు చేపట్టిన తనిఖీల్లో అక్రమంగా ఆవులను తరలిస్తున్న వాహనాన్ని పట్టుకున్నారు. శనివారం తెల్లవారుజామున రోల్ మామడ టోల్ ప్లాజా వద్ద ఇచ్చోడ సీఐ రమేష్, నేరడిగొండ ఎస్ఐ ఇమ్రాన్ వాహనాలు తనిఖీ చేస్తుండగా ఇచ్చోడ నుండి నిర్మల్ వైపు వెళ్తున్న టాటా వాహనంలో మూడు ఆవులను క్రూరంగా కట్టి తరలిస్తున్నట్లు గుర్తించారు. నిందితులు నిర్మల్‌కు చెందిన షారుఖ్ ఖురేషి, గుడిహత్నూర్ నివాసి మహ్మద్‌లను అదుపులోకి తీసుకున్నారు. బజార్‌హత్నూర్ మండలం అనంతపూర్ గ్రామంలో తక్కువ ధరకు ఆవులను కొనుగోలు చేసి, నిర్మల్‌లోని కబేళాకు తరలించి లాభం పొందాలనే ఉద్దేశంతో రవాణా చేస్తున్నట్లు నిందితులు ఒప్పుకున్నారు. పోలీసులు మూడు ఆవులు, వాహనం, మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఆవులను బజార్‌హత్నూర్ గోశాలకు తరలించి, నిందితులను రిమాండ్‌కు పంపారు. పశువుల అక్రమ రవాణాపై కఠిన చర్యలు తప్పవని సీఐ రమేష్ హెచ్చరించారు.



